టెన్త్ విద్యార్థులకు 'పల్లా' చేయూత

ధూళిమిట్టలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 5: టెన్త్ వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థులకు చేయూతనందించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరీక్ష సామగ్రిని అందిస్తున్నట్లు బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. ధూళిమిట్ట మండల కేంద్రంతో పాటు బైరాన్‌పల్లి, మద్దూరు, లద్నూర్, రేబర్తి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామగ్రిని స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతల చేతుల మీదుగా అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఖాజా ఆరీఫ్, ఎంపీటీసీలు బొప్పె కనకమ్మ, నర్సింహులు, సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కనకయ్య, వరలక్ష్మి, సుదర్శన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్య, మల్లేశం, పురుషోత్తం, లింగారెడ్డి, శ్రీనివాస్, మండల నాయకులు రాజమల్లయ్య, వెంకట్‌గౌడ్, బాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణ, భాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా సేవలు అభినందనీయం

చేర్యాల, మార్చి 5 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల నిమిత్తం ఎగ్జామ్స్ కిట్స్ అందజేయడం అభినందనీయమని ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సొంత ఖర్చులతో కొనుగోలు చేసి పంపించిన ఎగ్జామ్స్ కిట్స్‌ను మంగళవారం బీఆర్ఎస్ నాయకుల బృందం మండలంలోని ముస్త్యాల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అర్జునపట్ల, కమలాయపల్లి, ఆకునూరు,వీరన్నపేట, చుంచనకోట గ్రామాల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎలికట్టె శివశంకర్, మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, నాయకులు కొంగరి గిరిధర్, అజహర్‌అహ్మద్, అరిగే కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చేర్యాల, మార్చి 5 : జనగామ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కొమ్మూరి ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డితో పాటు ఓయూ వీసీ రవీంద్రయాదవ్, రిజిస్టార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరినట్లు తెలిపారు.

రెవెన్యూ మేళాను సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్ రెవెన్యూ మేళాలో దరఖాస్తు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

హుస్నాబాద్‌టౌన్, మార్చి 5: మున్సిపల్ రెవెన్యూ మేళాను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ మేళా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈనెల 5 నుంచి 31వతేదీవరకు రెవెన్యూ మేళా ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇండ్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం, ఇంటిపన్ను ఎక్కువగా రావడం, బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకునేందుకు రెవెన్యూమేళాలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పేర్లు సరిచేసుకోవడం, ఇల్లు రిజిస్ట్రేషన్ అయినప్పటికీ పేరు మార్పు చేసుకోనివారితోపాటు పలు సమస్యలకు రెవెన్యూ మేళా పరిష్కారం చూపుతుందని చెప్పారు. ఇంటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఈసీ, అనుమతి పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, మాజీఎంపీపీ ఆకుల వెంకట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, జూనియర్ అసిస్టెంట్ జాలిగం శంకర్, బోజు రవీందర్, సావుల రాజమౌళి పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మల ప్రసాదం వితరణ

బెజ్జంకి, మార్చి 5: మండలంలోని తోటపల్లి సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా వచ్చిన కుంకుమ, పసుపు, ఒడిబియ్యాన్ని ఇంటింటికీ మంగళవారం నిర్వాహకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నర్సింగరావు, సభ్యులు నర్సయ్య, రాములు, ఎల్లయ్య, శ్రీనివాస్, వెంటకస్వామి, మల్లేశ్, ఆకోశ్, స్వామి పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

హుస్నాబాద్, మార్చి 5: బీఆర్ఎస్ హుస్నాబాద్ మండల, పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్‌కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమ వుతుందని, ఈ సమావేశానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని వారు పేర్కొన్నారు. హుస్నాబాద్ మండలంతో పాటు పట్టణంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని వారు కోరారు.

మల్లన్న' భూములు పరిరక్షించాలి

కొమురవెల్లి, మార్చి 5 : కొమురవెల్లి మల్లన్న ఆలయ భూములను కాపాడేందుకు ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి కోరారు. మంగళవారం మల్లన్న క్షేత్రంలోని భూములను సీపీఎం నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో లక్షలు పెట్టి ప్రహరీలు నిర్మించారని, ఇటీవల కొందరు ఓ నాయకుడి అండతో గోడను కూల్చి వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేశారన్నారు. ఆలయ అధికారులు గోడను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకొని, స్వామి వారి భూములను పరిరక్షించాలన్నారు. తాడూరి రవీందర్, కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు, మల్లేశం, యా దయ్య, నరేశ్, రవీందర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ దుబ్బాక కోసం కృషిచేయాలి

దుబ్బాక, మార్చి 5: స్వచ్ఛ దుబ్బాక కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ కోరారు. మంగళవారం వేకువ జామున దుబ్బాక పట్టణంలోని పలు వార్డులతో పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం పూర్తిగా నిషేధించాలని ప్రజలకు సూచించారు. పర్యావరణ పరిరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. దుబ్బాకను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సరస్వతీమాత ఆలయంలో పూజలు

వర్గల్, మార్చి 5 : వర్గల్ సరస్వతీమాత ఆలయం మంగళవారం మూలానక్షత్ర విశేష పూజలతో అలరారింది. ఉదయం చంద్రశేఖరశర్మసిద్ధాంతి నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు.అనంతరం లక్షపుష్పార్చన, చండీహోమం, ప్రత్యేక పూజలు, అలంకార సేవలు జరిపించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

కుంకుమార్చన, పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

ఫిర్యాదుదారుల గౌరవానికి భంగం కలిగించొద్దు

మాట్లాడుతున్న సీపీ అనురాధ

సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 5 : ఫిర్యాదుదారుల గౌరవానికి భంగం కలిగించొద్దని సీపీ అనురాధ తెలిపారు. మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో రిసెప్షన్ వర్టికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులను చూసి వారి సమస్యలు అడిగి తెలుసుకొని భరోసా కల్పించి వీలైనంత త్వరగా న్యాయం చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే పేదవారికి, మహిళలకు వృద్ధులకు వారి సమస్యలు మానవీయ కోణంలో విని వెంటనే పరిష్కరించాలని సూ చించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఐటీ సెల్ ఎస్సై నరేందర్‌రెడ్డి, సిబ్బంది రాజిరెడ్డి, హరికృష్ణ, స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

చిన్నకోడూరు, మార్చి 5 : మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయడం జరుగుతుందని సిద్దిపేట సీపీ డా.బి అనురాధ అన్నారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సందర్భంగా మహిళా సాధికారిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎల్ఈడీ టీవీని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వికాస్‌రాజ్, డిప్యూటీ రీజినల్ హెడ్ వీరరాఘవ, సంజయ్ కుమార్ దరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ రద్దయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం

సిద్దిపేట,మార్చి 5 :ఎల్ఆర్ఎస్ రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు గ్రామ పంచాయతీ లేఅవుట్లను ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్ కట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వజీర్, ప్రభాకర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, ఇర్షాద్,తిరుపలి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

సిద్దిపేట టౌన్,మార్చి 5 : ప్రభుత్వం వెంటనే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం రాజలింగం మండిపడ్డారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు గ్రామ పంచాయతీ లేఅవుట్లను ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు.తీరా అధికారం చేపట్టిన తర్వాత ఇప్పుడు ఎల్ఆర్ఎస్ కట్టాలని ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయంతో చాలా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జారీ చేసిన ఎల్ఆర్ఎస్ జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. సమావేశంలో సంఘం నేతలు శంకర్, మల్లారెడ్డి, ప్రవీణ్, జనార్దన్, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజలింగం, నేతలు

బెక్కల్‌లో అగ్నిగుండాల ప్రవేశం

బెక్కల్‌లో అగ్నిగుండాలను దాటుతున్న భక్తులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 5: ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున భక్తులు అగ్ని గుండాల ప్రవేశం చేశారు. భక్తులు శివనామస్మరణతో అగ్నిగుండాలను దాటారు. ఆలయంలో అర్చకులు వీరభద్ర విజయం, గెలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఋత్విక్ సన్మానం కార్యక్రమాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేశం, అర్చకులు సిద్దాపురం శివప్ప, మఠం శివకుమార్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల కోసం ఎదురుచూపు

గజ్వేల్, మార్చి 5 : ప్రభుత్వం అమ లు చేసిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన వారికి అమలుకావడం లేదు. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, వృద్ధులు మంగళవారం గజ్వేల్ ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకొని అధికారుల కోసం ఎదురుచూశారు. ప్రభుత్వం అమలు చేసిన గృహజ్యోతి పథకంలో అర్హులైన వారికి జీరో బిల్లు రావడం లేదని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. విద్యుత్ 200 యూనిట్ల లోపు వాడుకునే ప్రతి ఒక్కరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేస్తామని చెప్పిన ప్రభుత్వం తమకు ఎందుకు అమలు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 200యూనిట్ల ఉచిత కరెంట్ కోసం ఆరు గ్యారెంటీల దరఖాస్తు ఫారం గ్రామాల్లోనే అధికారులకు ఇచ్చామని వాపోయారు. అధికారులు రాకపోవడంతో ఆరుబయట కూర్చున్నారు.

క్యాన్సర్ అంటే భయం వద్దు

సిద్దిపేట టౌన్, మార్చి 5 : క్యాన్సర్ అంటే భయం వద్దు..ముందుగా గుర్తిస్తే ప్రాణాన్ని కాపాడొచ్చని ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ హరీశ్ కంచర్ల అన్నారు. సిద్దిపేట పట్టణానికి చెందిన నాలుగేండ్ల చిన్నారి బ్లడ్ క్యాన్సర్ బారినపడి యశోద దవాఖానలో చికిత్స పొంది ప్రమాదకరమైన క్యాన్సర్ జయించింది. ఈ మేరకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం క్యాన్సర్‌పై వైద్యులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వైద్యుడు హరీశ్‌కంచర్ల మాట్లాడుతూ.. క్యాన్సర్ బారిన పడిన చిన్నారికి రెండేండ్ల పాటు కీమో చికిత్స అందించామని, ప్రస్తుతం వ్యాధి పూర్తిగా నయమైందరు. ముందుగా గుర్తిస్తే 90 శాతం క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

బెజ్జంకి, మార్చి 5: బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రాణి, మాజీ సర్పంచ్ తిరుపతి, సభ్యులు ప్రశాంత్, అన్నమేరి, సుజాత పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సిద్దిపేటలోని ఇందిరమ్మ కాలనీ మూడో వీధిలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారం

సిద్దిపేట, మార్చి 5: సిద్దిపేట పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. రెండు నెలల నుంచి పారిశుధ్య నిర్వహణపై శానిటరీ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. స్వచ్ఛ మున్సిపాలిటీగా అనేక అవార్డులు అందుకున్న సిద్దిపేట మున్సిపాలిటీలో నేడు పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారు. డ్రైనేజీల్లో మురుగు నీరు పేరుకుపోయింది. సిద్దిపేట మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీ మూడో వీధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కాలనీల్లో పలు చోట్ల మురుగు కాల్వలు నిండి కొన్ని చోట్ల నీరు రోడ్లపైకి వస్తుంది. దీంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీల్లో రెండు నెలల నుంచి డ్రైనేజీలు శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆకాలనీ వాసులు వాపోతున్నారు. చెత్త సేకరణలో శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనికి తోడు వీధులను శుభ్రం చేయడం లేదు.

త్రిబుల్ ధమాకా

మూడు ఉద్యోగాలు సాధించిన నరేశ్, శ్రావ్యరెడ్డి

నరేశ్

గజ్వేల్, మార్చి 5: గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీప్రసన్న కాలనీకి చెందిన స్వర్గం రఘు, పద్మల కుమారుడు నరేశ్ ఏకకాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. టీఆర్ఈఐఆర్‌బీ నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయ పరీక్షలో ప్రతిభ చాటాడు. ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసిన నరేశ్ సెట్, టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆశయంతో కష్టపడి చదువడంతో ఒకేసారి గురుకుల విభాగంలో జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తు తం నరేశ్ సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జంతుశాస్త్రం అతిథి అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించడంపై కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేయగా స్నేహితులు, పట్టణ వాసులు, బంధువులు అభినందించారు.

సిద్దిపేట పట్టణంలో..

సిద్దిపేట అర్బన్, మార్చి 5 : సిద్దిపేట పట్టణంలోని మైత్రి వనానికి చెందిన బెజ్జంకి శ్రావ్యరెడ్డి మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. ఇటీవల విడుదలైన వివిధ పరీక్షా ఫలితాల్లో ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించింది. మహాత్మాజ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల లెక్చరర్, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల లెక్చరర్‌గా, మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైంది. ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం లో జరిగిన కార్యక్రమంలో శ్రావ్యరెడ్డి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఆర్డర్ కాపీని అందుకుంది.

మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎల్‌బీ స్టేడియంలో ఆర్డర్ కాపీని అందుకుంటున్న శ్రావ్యరెడ్డి

గందరగోళంగా 'గృహజ్యోతి'

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో గృహజ్యోతికి తిరిగి దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

గజ్వేల్ అర్బన్, మార్చి5: గజ్వేల్ డివిజన్‌లో గృహజ్యోతి పథకం గందరగోళాన్ని సృష్టించింది. అందరికీ జీరోవిద్యుత్ బిల్లులు రాకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రాని వారు మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో తిరిగి దరఖాస్తులు అందజేశారు. గజ్వేల్ విద్యుత్ డివిజన్‌లో మొత్తం లక్షా483 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇప్పటి వరకు విద్యుత్ సిబ్బంది 24875 కనెక్షన్ల వినియోగదారులకు జీరో బిల్లులు అందజేశారు. అధికారుల లెక్కల ప్రకారం మరో వారం రోజుల్లో 60వేల కనెక్షన్లకు జీరో విద్యుత్‌బిల్లులు ఇచ్చే అవకాశం ఉన్నది. అంటే దాదాపు మిగతా 40483 కనెక్షన్లకు జీరోబిల్లులు రావని స్పష్టమవుతుంది. రేషన్‌కార్డులు లేనివారంతా తమ పరిస్థితి ఏమిటని అయోమయంలో పడ్డారు. సమస్యల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలకు రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతానికి జీరోబిల్లు రాని వారి నుంచి తిరిగి దరఖాస్తులు తీసుకుంటున్నారు.

ఉపకాల్వల నిర్మాణ పనుల పరిశీలన

దుబ్బాక, మార్చి 5: మల్లన్నసాగర్ కాల్వల నిర్మాణ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సోమవారం రైతులు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. సంబంధిత ఇరిగేషన్ (మల్లన్నసాగర్) అధికారులతో పాటు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి, కాల్వ నిర్మాణ పనులు వేగంగా కొనసాగించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, నాయకుడు కొత్త కిషన్‌రెడ్డి తదితరులు కాల్వల నిర్మాణ పనులను పరిశీలించారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

కొండపాక, మార్చి 5 : కొండపాక మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ర్యాగల సుగుణపై అవిశ్వాస తీర్మానం ప్రకటిస్తూ మంగళవారం మండలానికి చెందిన 8 మంది ఎంపీటీసీలు ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగేండ్లు మండల అభివృద్ధి కార్యక్రమాలపై నిర్లక్ష్యం వ్యవహరించడంతో మండల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఆ కారణం చేతనే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలను అమలు చేయాలి

కొమురవెల్లి, మార్చి 5 : ప్రభుత్వం గౌడ సంక్షేమం కోసం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను వెంటనే అమలు చేయాలని గౌడ జనహక్కుల పోరాట సమితి(మోకుదెబ్బ) జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముత్యం నర్సింహులుగౌడ్ అన్నారు. మంగళవారం కొమురవెల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ కల్లుగీత వృత్తి రక్షణ కోసం దశల వారీగా ఉద్యమం చేపడుతామన్నారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలన్నారు. అనంతరం హైదరాబాద్‌లో రవాణ, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేయడంతో పాటు మంత్రిని సన్మానించారు. కార్యక్రమం లో గౌడ జనహక్కుల పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్,మార్చి 5 : సిద్దిపేట మేరు చక్ర వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని వైశ్యభవన్ అధ్యక్షుడు గట్టు రవీందర్ అన్నారు.ఉత్సవాల కరపత్రాన్ని మంగళవారం అమ్మవారి సన్నిధిలో ఆవిష్కరించారు. ఆలయంలో మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం తదితర ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో బుచ్చయ్య, ఐయిత రత్నాకర్, కూర శ్రీనివాస్, మోనయ్య పాల్గొన్నారు.

ఘనంగా దయానంద సరస్వతి జయంతి

సిద్దిపేట కమాన్, మార్చి 5 : సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వామి దయానంద సరస్వతి జయంతి నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆర్షశోద సంస్థానం నిర్వాహకురాలు ఆచార్య నీరజ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి యాదవరెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, నరసింహారెడ్డి, గ్రామస్తులు తుపాకుల బాలరంగం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోండి

హుస్నాబాద్‌టౌన్, మార్చి 5: గృహజ్యోతిపథకంలో జీరో బిల్లురాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పురపాలక సంఘం, బస్తీదవాఖాన, మల్లెచెట్టుచౌరస్తాలోని షా పింగ్‌కాంప్లెక్స్‌లో ప్రజాపాలన సేవాకేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. గృహజ్యోతి జీరో బిల్లు రాని వారు, మీటర్ నంబర్ సరిచేయడంతో పాటు నూతనంగా దరఖాస్తులు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి5: ఉమ్మడి మద్దూరు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ జరుగుతుందని, ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవో పరశురాములు అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని రేబర్తిలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డీఆర్పీ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

గజ్వేల్, మార్చి 5 : ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పిరమిల్ ఫైనాన్స్ కంపెనీ సమన్వయంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, 2022, 2023లో డిగ్రీ పూర్తి చేసినవారు, ప్రస్తుతం డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువప్రతాలు, ఒక పాస్‌ఫొటో, జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు మహ్మద్ జబ్బర్ సెల్: 9396421849 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్థికసాయం

గజ్వేల్, మార్చి 5: అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. మర్కూక్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నక్క ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం అతని భార్య కృష్ణవేణికి రూ.66వేల చెక్కును గజ్వేల్ డివిజన్ కార్యాలయంలో డీఈ భానుప్రకాశ్ అందజేశారు. ఏఈడీ జగదీశ్, ఏఈలు సుధీర్, బాలయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు చంద్రారెడ్డి, పరశురాములు, చంద్రంయాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందించిన నీలం మధు

తొగుట, మార్చి 5: తొగుటలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చింత కుమార్ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అండగా నిలిచారు. చింత కుమార్ కుటుంబ పరిస్థితిని ఎన్ఎంఆర్ సేన సభ్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబానికి ఎన్ఎంఆర్ సేన మండల అధ్యక్షుడు కొంత భాస్కర్, చింత అజయ్, పిట్టల యాదగిరి, రాజు, నవీన్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

హనుమాన్ గుడికి ..

వర్గల్, మార్చి 5 : మండలంలోని అంబార్‌పేట గ్రామంలోని ఖాన్‌చెరువు కట్టపై కొత్తగా పునరుద్ధరిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ మండల నాయకుడు అనిల్‌రెడ్డి మంగళవారం రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కొడపర్తి కృష్ణ,రాజిరెడ్డి, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

పిట్టలవాడలో నీటి కొరత

కొండపాక, మార్చి 5 : కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి పరిధిలోని పిట్టలవాడలో నీటి కొరత ఏర్పడింది. వేసవిని దృష్టిలో ఉంచుకొని మంగళవా రం కొండపాక కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వాసరి లింగారావు బోరువేయించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The public in general are here by informed that Sri. Burugu Amrendhar S/o Ramulu, aged 38 years, R/o H.No.4-81/4, Shanthi Nagar, Balaji Nagar, Medchal-Malkajgiri District has approached my client i.e., A.P. Grameena Vikas Bank, Branch: Gajwel for sanction and release of loan and offered his property i.e., plot bearing No.44 admeasuring 150 Sq.Yards in Sy.No.150, situated at Gajwel Town and Mandal, Siddipet District, cover under registered sale deed No. 7054/2019 of SRO Gajwel and further informed that one of the link document bearing No.322/2019 of S.R.O. Gajwel was lost beyond recovery. In this connection the public are informed to submit objections if any within 5 days of this publication to me for mortgaging the above property in favour of my client-bank. If no objections are received within the above stipulated time, it shall be deemed that there are no objections and my client-bank will proceed further. Later no objections will be entertained.

Sd/- G.KALI PRASAD,
ADVOCATE,
GAJWEL, DISTRICT SIDDIPET.
Cell No. 9440493461